## స్టార్ ప్యారడైజ్ హైస్కూల్లో ఐక్యతకు ప్రతీకగా క్రిస్మస్ వేడుకలు



యాడికి,డిసెంబర్ 23 (అనంత ప్రభ )

యాడికి మండల కేంద్రంలోని స్టార్ ప్యారడైజ్ హైస్కూల్‌లో మంగళవారం సపోస్ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో క్రిస్మస్ ట్రీని సుందరంగా అలంకరించి, క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ సభ్యులు నాగేంద్ర, రంగా, ఇలాహి మాట్లాడుతూ ఏసు క్రీస్తు బోధించిన ప్రేమ, శాంతి, సహన భావాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని తెలిపారు. మానవులంతా ఐక్యతతో, సోదరభావంతో జీవించాలన్నదే క్రిస్మస్ సందేశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు విశేషంగా ఆకట్టుకున్నాయి. క్రిస్మస్‌కు సంబంధించిన పాటలు, నృత్యాలు, నాటికలు వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రూప, అరుణ, పరమేష్, శశినేత్రతో పాటు ఇతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు

## కోనుప్పలపాడు గ్రామంలో జల అర్పణ దివస్ కార్యక్రమము



యాడికి, డిసెంబర్ 23 (అనంత ప్రభ )

యాడికి మండలము కోనుప్పలపాడు గ్రామములో జల అర్పణ్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమములో గ్రామ సర్పంచ్ మార్కే రామలక్ష్మమ్మ, ఆర్డబ్ల్యూఎస్ అధికారి దేవా , పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో కలిసి తాగునీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలోని ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ సమీపంలో ఆకర్షణీయమైన రంగోలిని ఏర్పాటు చేసి, నీటి ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ మరియు అధికారులు మాట్లాడుతూ తాగునీటి వనరులను కాపాడుకోవడం, నీటి వృథాను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చూడాలంటే ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రజలు నీటి సంరక్షణకు తమ వంతు బాధ్యతగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన నరేష్



యాడికి,డిసెంబర్ 23 (అనంత ప్రభ )

అనంతపురంలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న యాడికి మండల కేంద్రానికి చెందిన తెల్లాకుల కేశవ కుమారుడు తెల్లాకుల నరేష్ జిల్లాస్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో తన ప్రతిభను చాటాడు. ఇటీవల జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో నరేష్ 100 మీటర్ల పరుగు పోటీలో 11.91 సెకన్లలో పూర్తి చేసి మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. అలాగే లాంగ్ జంప్ విభాగంలో 5.5 మీటర్ల దూరం దూకి మొదటి బహుమతి సాధించాడు. అదేవిధంగా త్రో బాల్ జంప్‌లో 11.5 మీటర్లతో మరోసారి ప్రథమ స్థానంలో నిలిచి కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చాడు. నరేష్ సాధించిన ఈ విజయాలపై కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మరియు యాడికి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను ఘనంగా అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా నరేష్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు

## క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన రుద్రమ నాయుడు



యాడికి,డిసెంబర్ 23 (అనంత ప్రభ )

యాడికి టీడీపీ మాజీ మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని యాడికి మండలంలోని క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ యేసుక్రీస్తు చూపిన ప్రేమ, కరుణ, త్యాగ భావనలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలంటే యేసుక్రీస్తు అడుగుజాడల్లో నడవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. క్రిస్మస్ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, ఆశ, సానుకూల మార్పులు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే కుల, మత, వర్గ భేదాలు లేకుండా అందరూ పరస్పర అభిమానముతో మెలిగి, సమాజ అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు

## క్రిస్మస్‌కు చర్చిల ముస్తాబు



యాడికి,డిసెంబర్ 23 (అనంత ప్రభ )

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని యాడికి మండలంలోని పలు చర్చిలు విద్యుత్ దీపాలంకరణతో ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చి, అగాపే ప్రార్థన మందిరం తదితర చర్చిలను క్రిస్మస్ స్టార్లు, రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. చర్చిల ప్రాంగణాలు పండుగ వాతావరణంతో కళకళలాడుతుండగా, క్రిస్మస్ వేడుకల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల్లో నిత్య ప్రార్థనలు, బైబిల్ పఠనాలు నిర్వహిస్తూ ప్రభువు యేసుక్రీస్తు జన్మ సందేశాన్ని విశ్వాసులకు వివరిస్తున్నారు. శాంతి, సౌభ్రాతృత్వం, సందేశాలను పంచేలా కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్చిల కమిటీలు సిద్ధమయ్యాయి. మండలమంతటా క్రిస్మస్ సందడి నెలకొంది.

## ఉరవకొండలో క్రిస్మస్ వేడుకలు వృద్ధులు, అనాథలకు వస్త్రాల పంపిణీ



ఉరవకొండ, డిసెంబర్ 24 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణంలోని పాండురంగ అనాథ ఆశ్రమంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మాల%-%మహానాడు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో నివసిస్తున్న వృద్ధులు, అనాథలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు.

గత కొన్ని సంవత్సరాలుగా క్రిస్మస్ పండుగ సందర్భంగా అనాథలకు, వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేయడం మాల%-%మహానాడు ఆధ్వర్యంలో ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ ఏడాది కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ మాల%-%మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు బాల రామాంజనేయులు నేతృత్వంలో ఆశ్రమంలోని వృద్ధులు, అనాథలకు చొక్కాలు, పంచెలు, చీరలను పంపిణీ చేశారు.

పండుగ వేళ సమాజంలోని అభాగ్యులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. క్రిస్మస్ సందేశమైన ప్రేమ, సేవ, మానవత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాల%-%మహానాడు నాయకులు, కార్యకర్తలు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొనగా, వస్త్రాలు అందుకున్న వృద్ధులు, అనాథలు ఆనందం వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు

## అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడిగా వేలూరు రంగయ్య ఎంపిక



యాడికి,డిసెంబర్ 23 (అనంత ప్రభ )

అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడిగా వేలూరు రంగయ్య ఎంపిక కావడం పట్ల పార్టీ శ్రేణులు హర్షము వ్యక్తము చేశారు. ఈ సందర్భంగా మాజీ మండల కన్వీనర్లు గొర్తి రుద్రమ నాయుడు , మాదాల అనిల్ మరియు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వేలూరు రంగయ్య పార్టీ కోసం చేసిన సేవలు, ప్రజలతో ఆయనకు ఉన్న సన్నిహిత సంబంధాలను గుర్తించి పార్టీ అధిష్ఠానం ఈ బాధ్యతలు అప్పగించిందని నాయకులు పేర్కొన్నారు. ఆయన ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం ద్వారా జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం వేలూరు రంగయ్య గారు మరింత కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధిగా రెండవసారి ఎన్నికైన శశాంక్ చౌదరి,



ఆత్మకూరు, డిసెంబర్ 24 (అనంత ప్రభ)

రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు మండల పరిధిలోని సిద్ధరాంపురం గ్రామానికి చెందిన స్థానిక మాజీ సర్పంచ్, శశాంక్ చౌదరి చిన్ననాటి నుండి తల్లిదండ్రుల మీద గౌరవం వారు నేర్పినటువంటి క్రమశిక్షణతో ఉన్నతమైన చదువు పూర్తిచేసుకుని తెలుగుదేశం పార్టీ మీద అభిమానంతో గ్రామస్థాయి నుండి నియోజవర్గ స్థాయి వరకు తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ అందరిని సోదర, సోదరి భావంతో ఆప్యాయంగా పలకరిస్తూ తెలుగుదేశం పార్టీ మీద మక్కువతో పార్టీ మీద తనకు ఉన్నటువంటి అభిమానం చిత్తశుద్ధితో సుదీర్ఘంగా పార్టీలో తనదైన శైలిలో అధిష్టానం ఆశీస్సులతో ప్రజలకు సేవలను అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న నాయకుడిగా గ్రామస్థాయి నుండి మండల స్థాయికి, మండల స్థాయి నుండి నియోజవర్గ స్థాయికి ఎదగడంతో పార్టీ అధిష్టానం గుర్తించి తనకు తెలుగుదేశం పార్టీ లో రాప్తాడు నియోజకవర్గం హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి గా ఉంటూ ప్రభుత్వ సంక్షేమంతో నిరుపేదలకు న్యాయం చేస్తూ తెలుగుదేశం పార్టీని నమ్ముకున్న వారి నిరంతరం శ్రమిస్తూ తనదైన శైలిలో నియోజకవర్గ స్థాయి నుండి గ్రామస్థాయి వరకు పార్టీలో చురుగ్గా పనిచేసినందుకు రెండవసారి హిందూపూర్ పార్లమెంట్ అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మరియు మంత్రి నారా లోకేష్ కు నాకు ఈ పదవి రావడానికి చొరవ చూపిన ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మకు మరియు ధర్మవరం ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ కు హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మహిళ పై దాడి చేసిన చంద్రు నాయక్ పై కేసు నమోదు




అనంతపురం, డిసెంబర్ 24 (అనంత ప్రభ)

స్థానిక బెలుగుప్ప మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి తండాకు చెందిన చంద్రు నాయక్ మహిళపై దాడి చేసిన ఘటన పై బుధవారం బెలుగుప్ప పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా.. పిల్లనిచ్చిన మామ వారి తమ్ముడి మధ్య చిచ్చు పెట్టి, సినిమా పక్కీలో కట్టు కథలు అల్లి, వారు పన్నిన పక్కా పథకంలో భాగంగా మామ పై మూకుమ్మడి దాడికి పాల్పడి, ఆ ముకుమ్మడి లో గల వ్యక్తులకు అనుకోకుండా వారికి వారే కొట్టుకున్న దెబ్బకు, వారి పథకంలో ఇబ్బందులు పెట్టాలనుకున్న వ్యక్తి ఇంటి వద్దకు రెండవ సారి రంగ ప్రవేశం చేసి మహిళ ను దుర్భాషలాడి దాడి చేసిన ఘటనలో ఇటీవల నేర చరిత్ర కలిగిన చంద్రు నాయక్ పై బెళుగుప్ప పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు కారణం అత్త సొమ్ము అల్లుడు దానం చేశాను అన్న సామెత ఉట్టిపడేలా వారు వ్యవహరించడమే కారణమని బాధితులు తెలిపారు

## ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసిన టీడీపీ నాయకులు



ఉరవకొండ, డిసెంబర్ 24 (అనంత ప్రభ)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలోని ఆర్థిక శాఖ మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్ గారి ఛాంబర్‌లో బుధవారం తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ భేటీలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు రేగాటి నాగరాజు, ఉరవకొండ మండల అధ్యక్షుడు విజయ్ భాస్కర్, చాబాలమాజీ గ్రామ సర్పంచ్ సి. ఎర్రి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉరవకొండ మండలం పరిధిలోని పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి అవసరాలను మంత్రివర్యుల దృష్టికి నాయకులు తీసుకువచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా రహదారుల అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం.

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన సహకారం అందిస్తామని మంత్రి పయ్యావుల కేశవ్ గారు ఈ సందర్భంగా హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి హుండీ లెక్కించిన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్



ఆత్మకూరు, డిసెంబర్ 24 (అనంత ప్రభ)

ఆత్మకూరు మండలం పంపనూరు గ్రామంలో వెలిసినటువంటి ప్రసిద్ధి చెందిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి హుండిని ఆలయ కార్య నిర్వహణ అధికారి బి బాబు సమక్షంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బుధవారం ఉదయం 10-00 గంటలకు అనంతపురం జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ గంజి మల్లికార్జున ప్రసాద్ పర్యవేక్షణ లో ఆలయ ఛైర్మెన్ వేణుగోపాల్ రెడ్డి మరియు ఆలయ కమిటీ సభ్యులు మరియు పాలక మండలి సమక్షంలో దేవస్థానము లో హుండీ లెక్కింపు నిర్వహించగా మూడు మాసములకు గాను రూ.20,20,954-00 /- అక్షరాలా - ఇరవై లక్షల ఇరవై వేల తొమ్మిది వందల యాభై నాలుగు రూపాయలు/- ఆదాయము మరియు గోల్డ్ 6 గ్రాముల 300 మిల్లి గ్రాములు, వెండి 3 కేజీల 600 గ్రాములు వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు , ఆలయ సిబ్బంది , భ్రమరాంబ సేవా సమితి సభ్యులు , ఆత్మకూరు పోలీస్ సిబ్బంది, ఆత్మకూరు స్టేట్ బ్యాంకు సిబ్బంది, మరియు గ్రామ పెద్దలు , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పంపనూరులో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



ఆత్మకూరు, డిసెంబర్ 24 (అనంత ప్రభ)

ఆత్మకూరు మండలం పంపనూరు గ్రామంలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో టాయిలెట్లు మరియు బాత్రూములు ఏర్పాటుకు స్వచ్ఛ ఆంధ్ర మిషన్ రాష్ట్ర డైరెక్టర్ భవాని రవికుమార్ మరియు ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ మరియు బ్యూటిఫికేషన్ డైరెక్టర్ రావూరు లక్ష్మీదేవి జెసిబి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యంగా ప్రజలు వారి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు రావన్నారు. ముఖ్యంగా సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం దర్శనం కోసం వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పనలో భాగంగానే నేడు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు దేవాదాయ శాఖ ఏసి మల్లికార్జున ప్రసాద్, ఆలయ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్వర్రెడ్డి, ఆనంద్, ప్రసాద్, రామకృష్ణ, రాజన్న, ఆర్ డబ్ల్యు ఇంజనీర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీస్తు మార్గం.. శాంతి సందేశం



అనంతపురం, డిసెంబర్ 24 (అనంత ప్రభ)

కరుణ, త్యాగానికి ప్రతీక క్రిస్మస్ అని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. విశ్వమానవాళికి తన ప్రేమతత్వంతో వెలుగులు పంచిన కరుణామయుడు ఏసుక్రీస్తు అని పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగ పురస్కరించుకొని క్రైస్తవ సోదరీ సోదరీమనులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. క్రీస్తు జననం శాంతికి సంకేతమని.. తన జీవితం, మరణం ద్వారా ఈ లోకానికి సరైన మార్గాన్ని ఏసు ప్రభువు చూపారని తెలియజేశారు. సమాజంలో చెడునుపక్కన పెట్టి మంచిని పెంపొందించాలని.. ఏసు క్రీస్తు బోధనలు మనల్ని సన్మార్గంలో నడిచేలా చేస్తాయని పేర్కొన్నారు. ప్రపంచ మానవాళికి శాంతియుతమైన, ప్రేమ పూర్వకమైన జీవన మార్గాన్ని ఉపదేశించి సమాజాన్ని సంస్కరించిన యుగకర్త ఏసు ప్రభువు అని అన్నారు. ప్రతి ఒక్కరూ స్వార్థాన్ని వీడితేనే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని తెలిపారు. ఏసుప్రభువు జన్మదినం సర్వ మానవాళికి పవిత్రదినం అని పేర్కొంటూ జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు

## జర్నలిస్టుల ఆవేదనను మన్నించిన కలెక్టర్ ప్రెస్ క్లబ్ లోకి షరతులతో కూడిన అనుమతి




అనంతపురం, డిసెంబర్ 24 (అనంత ప్రభ)

కొన్ని అనివార్య కారణాలవల్ల మంగళవారం మూత పడిన ప్రెస్ క్లబ్ బుధవారం తెరిచేందుకు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ షరతులతో కూడిన అనుమతులు ఇచ్చారు. బుధవారం మధ్యాహ్నం సీనియర్ జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ ను కలవడం జరిగింది. వారి ఆవేదనను మన్నించిన కలెక్టర్ ప్రెస్ క్లబ్ కార్యకలాపాలకు అంతరాయం లేకుండా అనుమతి ఇచ్చారు. ప్రెస్ క్లబ్ తెరిచే వేళలను కూడా ప్రకటించడం జరిగింది. ప్రతిరోజు ఉదయం 7:00 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రెస్ క్లబ్ తెరిచి ఉంటుంది. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి నాలుగు గంటల వరకు మూసి వేయడం జరుగుతుంది. తిరిగి , మధ్యాహ్నం నాలుగు గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ప్రెస్ క్లబ్ తెరిచి ఉంటుంది . జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు ఈ మేరకు నిర్ణయించారు. అనంతపురం ప్రెషక్లబ్ తరుపున జిల్లా కలెక్టర్ కు ధన్యవాదములు తెలిపారు.

## బెలుగుప్పల వద్ద రోడ్డు ప్రమాదం - ఒకరు మృతి

బెలుగుప్ప, డిసెంబర్ 24 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలంలోని వెంకటాద్రి పల్లి సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం బుధవారం సాయంత్రం సుమారు 5:30 గంటల సమయంలో జరిగినట్లు ప్రాథమిక సమాచారం. సంఘటనను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టగా, కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు

## యాడికి ఇన్చార్జ్ ఈవో గా అరుణ్ కుమార్ బాధ్యతలు స్వీకరణ



యాడికి,డిసెంబర్ 23 (అనంత ప్రభ )

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యాడికి ఇన్చార్జ్ గ్రామ పంచాయతీ అధికారిగా అరుణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం రాయలచెరువు గ్రామ పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు అదనపు బాధ్యతలుగా యాడికి గ్రామ పంచాయతీ ఇన్చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు,నాయకులు, అధికారుల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు

